ముందుకు సాగని రోడ్డు పనులు

- బాల్కొండ నుంచి కిసాన్‌నగర్ వరకు 2023లో ప్రారంభమైన పనులు
- ఇబ్బందుల్లో వాహనదారులు.. పట్టించుకోని అధికారులు


కంకర పోసి వదిలేసిన రోడ్డు పనులు

బాల్కొండ : మండల కేంద్రం నుంచి కిసాన్‌నగర్ వరకు చేపడుతున్న నాలుగు లైన్ల రోడ్డు వెడల్పు పనులు ముందుకు సాగడం లేదు. 2023 ఆగస్టులో గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ. రెండు కోట్ల నిధులను మంజూరు చేసింది. అదే నెలలో పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి కంకర వేశారు. కానీ తారు వేయడం మరిచారు. ఫలితంగా రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉంది. బాల్కొండ మండలం బోదేపల్లి చౌరస్తా నుంచి గ్రామం వరకు ముప్కాల్ మండలం రెంజర్ల నుంచి వన్నెల్(బి) వరకు, దూదిగాంలో చౌరస్తా నుంచి గ్రామం వరకు గల రోడ్ల పునరుద్ధరణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తవ్వకాలు చేపట్టి కంకర వేసి తారు వేయడం మరిచారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనులను ప్రారంభిస్తాం

నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. పనులు ప్రారంభించిన అన్ని ప్రాంతల్లో రోడ్డు నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తాం.

– నాందేవ్, డిప్యూటీఈఈ, ఆర్అండ్‌బీ బాల్కొండ

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలోని వన్నెల్(బి), బోదేపల్లి, జలాల్‌పూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'కోతలు షురూ.. కొనుగోళ్ల జాడెక్కడ' అనే కథనానికి అధికారులు స్పందించారు. మూడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గంగాధర్, మహిళా సమాఖ్య సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


జలాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

దళారులకు విక్రయించొద్దు


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంతిరెడ్డి రాజారెడ్డి

నవీపేట: రైతులు తమ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి సూచించారు. నవీపేట మండల కేంద్రంలో మహిళా మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, సాయారెడ్డి, మహిపాల్‌రెడ్డి, గోపాల్, సంజీవ్‌రెడ్డి, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్, అక్బర్ నగర్ గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జై భాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహాత్మగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలతో గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. అక్బర్‌నగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో కాంగ్రెస్ నాయకులు భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఇందూర్ చంద్రశేఖర్, తోట అరుణ్‌కుమార్, నరోజి గంగారాం, పత్తి రాము, నడిపింటి నగేశ్, రాంబాబు, సుదర్శన్ గౌడ్, బి సంజీవులు, పట్ల సురేశ్, దత్తాత్రి పాల్గొన్నారు.

గోవూరులో జైనుద్దీన్ సంస్మరణ సభ

మోస్రా: మండలంలోని గోవూర్‌లో పోరాట వీరుడు జైనుద్దీన్ సంస్మరణ సభను సీపీఎం నాయకులు గురువారం నిర్వహించారు. పాలేర్లకు తక్కువ జీతం ఇచ్చి, శ్రమ దోపిడీకి పాల్పడుతున్న భూస్వాముల మీద తిరుగుబాటు చేసిన గొప్ప పోరాట వీరుడు జైనుద్దీన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. కార్యక్రమంలో బొర్ర సత్యనారాయణ, గంగాధరప్పా, పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, శంకర్ గౌడ్, సుజాత, నన్నేసాబ్, యేశాల గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో శివాలయ పునర్నిర్మాణం కోసం గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత ఆలయం స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు భక్తులు తెలిపారు.

'కానూరి'కి ఘన నివాళి



నందిపేట్: మండల కేంద్రంలో అరుణోదయ వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు వర్ధంతి సభను గురువారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె గంగాధర్, సాయికుమార్, దేవన్న, విశ్వనాథ్, గంగాధర్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



ఆర్మూర్‌టౌన్: పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ అన్నారు. పట్టణ కేంద్రంలో ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించే వర్ధంతి సభలను పీడీఎస్‌యూ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. సభకు సంబంధించిన పోస్టర్లను పెర్కిట్‌లో గురువారం ఆవిష్కరించారు. సభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. నాయకులు హుస్సేన్, రాహుల్, పవన్, రహమాన్, ఆకాశ్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి, పూజ నరేందర్, సుంకరి రవి, డాన్ మహేశ్, లింబాద్రి గౌడ్, నచ్చు చిన్నా రెడ్డి, నర్మే నవీన్, చిన్నా రెడ్డి, సత్యం, లతీఫ్, అగ్గు క్రాంతి, పృథ్వీ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం స్థల పరిశీలన



రుద్రూర్: పొతంగల్ మండలం సోంపూర్ శివారులోని పీఎస్ఆర్ నగర్ (రాంగంగానగర్)లో ఉన్న ప్రభుత్వ భూమిని ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం గురువారం టీజీఈడబ్ల్యూ ఐడీసీ అధికారులు పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం 25 ఎకరాల స్థలం అవసరం కాగా, ఈ ప్రాంతంలో 15ఎకరాల15 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. స్థల పరిశీలనలో డీఈ సుబ్బారావు, ఏఈ నాగేశ్వరరావు, పొతంగల్ తహసీల్దార్ గంగాధర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శంకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు తీసుకుంటున్న సీనియర్ అసిస్టెంట్

డొంకేశ్వర్: మండల కేంద్రంలో ఇటీవల ప్రారంభమైన మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను తీసుకుంటున్నట్లు ఎంపీడీవో బ్రహ్మానందం తెలిపారు. మొన్నటి వరకు నందిపేట్ ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులు అందజేయడానికి మండల వాసులు ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకుని డొంకేశ్వర్ ఎంపీడీవో ఆఫీసులో కూడా దరఖాస్తులు తీసుకునే సౌకర్యం కల్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించాలన్నారు. రోజుకు 30 నుంచి 50 వరకు దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు మాతృవియోగం



బోధన్‌టౌన్: బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి షగుఫ్తా ఆబిద్(74) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి మృతి వార్త విన్న వెంటనే దుబాయిలో ఉన్న ఆయన ఇక్కడికి వచ్చారు. తల్లి పార్థివ దేహాన్ని చూసి కంటతడిపెట్టారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రజితా యాదవ్, పార్టీ నాయకులు షకీల్‌ను పరామర్శించారు. సాయంత్రం ఆచన్‌పల్లిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.


తల్లి మృతదేహాన్ని ముద్దాడుతున్న షకీల్

విప్లవ సమరయోధులకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

బోధన్: పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో విప్లవ సమరయోధులకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల నాయకులు ఘన నివాళులు అర్పించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వర్‌రావు, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటయోధుడు పైలావాస్ దేవ్‌రావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి వరదయ్య, పుట్ట వరదయ్య, సాయిలు, రాజ్‌కుమార్, సురేశ్, వినోద్, సాయాగౌడ్, శ్రీనివాస్, పేట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట


ముప్కాల్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బాల్కొండ: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామాల్లో ఉపాధ్యాయులు చేపట్టిన బడి బాట ముప్కాల్, మెండోరా పరిధిలోని పలు గ్రామాల్లో కొనసాగుతోంది. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లి దండ్రులకు వివరించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంగంలో..

బోధన్‌రూరల్: మండలంలోని సంగం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకలు బైండ్ల ప్రశాంత్, తోట మహేశ్, మాజీ సర్పంచ్ ధర్మన్న, గోజూర్ పోశెట్టి, రవి, మల్కారెడ్డి, కుస్తాపురం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



మోర్తాడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని లింగాపూర్‌లో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేస్తే దశలవారిగా బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



మోర్తాడ్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. స్టోర్ రూంలోని సరుకుల నాణ్యత, వంట గదిలో భోజన పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో తిరుమల, ఆర్ఐ రంజిత్, కస్తూర్బా స్పెషల్ అధికారి స్వప్న తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



రెంజల్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. రెంజల్ మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో గురువారం పీఎస్‌లో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారుల వద్ద తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు, సిబ్బంది ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన



బోధన్‌టౌన్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు హ్యాండ్‌వాష్, తల్లులకు రక్త హీనతపై అవగాహన కల్పించారు. పిల్లలకు చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో ప్రత్యక్షంగా చేసి చూయించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్ కళావతి, లావణ్య, చిన్నారులు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రుణాలను వినియోగించుకోవాలి



రెంజల్: సహకార బ్యాంక్ ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నవీపేట్ సహకార బ్యాంక్ మేనేజర్ గౌసొద్దీన్ తెలిపారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలి గ్రామంలో గురువారం రైతులకు బ్యాంక్ రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంకులు అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు


రాణాకలాన్..

డొంకేశ్వర్: మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ నరేశ్ కుమార్, మండల వ్యవసాయాధికారి మధుసూదన్ గురువారం పరిశీలించారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సన్నరకాల వడ్లను గుర్తించి రైతు వారీగా వివరాలు నమోదు చేయాలన్నారు.

ఎడపల్లి మండలంలో..

ఎడపల్లి: మండలంలోని రాణాకలాన్, కుర్నాపల్లి, ఎడపల్లి, మంగల్‌పాడ్ తదితర గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అధికారులు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆకుల మహేశ్, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు


కమ్మర్‌పల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

బోధన్/ కమ్మర్‌పల్లి : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50, పెట్రోల్, డీజిల్ లీటర్ ధర రూ.2 పెంచడాన్ని నిరసిస్తూ గురువారం బోధన్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పట్టణ, మండల కమిటీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, పడాల శంకర్, సీతారాం, నాగమణి, లత, శాంత, పోశెట్టి, బుడ్డన్న, గణపతి, నారాయణ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కేంద్రం పేద ప్రజలపై భారం వేయడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. నాయకులు ఎస్ సురేశ్, బి అశోక్, కిషన్, బాలయ్య, లక్ష్మి, రాధ, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

తపస్వీ తేజో నిలయంలో అన్నదానం

పెర్కిట్: మామిడిపల్లిలో ఉన్న తపస్వీ తేజో నిలయంలో గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది నేరేళ్ల విజయ్‌కుమార్ గురువారం అన్నదానం నిర్వహించారు. యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలన్ని అన్నారు. కార్యక్రమంలో ఎస్ పద్మ, ఎస్ నర్సయ్య, వినయ్, స్నేహ, చిన్నారులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న హైకోర్టు న్యాయవాది

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు) - 10.00, 1.05, 7.15, 10.20, ఫలక్ నుమా దాస్(తెలుగు)-4.10
స్క్రీన్-2	జాక్(తెలుగు)-10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-3	ద మమ్మీ (తెలుగు)-12.20, 2.50, 5.20, 7.50, 10.20
స్క్రీన్-4	గుడ్‌బ్యాడ్ అగ్లీ (తెలుగు)-10.30, 1.25 7.05, 10.0, మ్యాడ్ స్క్వేడ్(తెలుగు)-4.20



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	100
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	92,200	వెండి(కిలో)	97,500
22 క్యారెట్స్	85,100		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

కాలినడకన కొండగట్టుకు భక్తులు

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ నుంచి ఆంజనేయస్వామి భక్తులు కాలినడకన కొండగట్టుకు గురువారం బయలుదేరారు. ప్రతి ఏడాది హనుమాన్ జయంతికి కొండగట్టుకు కాలినడకన వెళ్తామని భక్తులు పేర్కొన్నారు. స్థానిక హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు చేసి కాలినడకన బయలుదేరి వెళ్లారు.

ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం

ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలోని మార్కండేయ ఆలయ అభివృద్ధి పనులకు కొక్కుల రాజేశ్, నీత ఆర్థికసాయం అందించారు. ఆలయ పరిసరాల్లో స్టీల్ జాలీ ఏర్పాటు చేయించారు. అనంతరం సంఘ సభ్యులు వీరిని సన్మానించారు. కార్యక్రమంలో అంబల్ల శ్రీనివాస్, చిట్ల యజ్ఞేశ్, జి రమేశ్, బత్తుల భాస్కర్, బొడ్డు గంగాధర్, జిందం నరహరి, కొక్కుల విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం గ్రామానికి చెందిన షఫీ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన రూ. 2 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్కొండ మండలం శ్రీరాంపూర్ చెందిన రాజన్న అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. అతని వైద్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1.25 లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ సేవలపై అవగాహన

బోధన్‌రూరల్: మండలంలోని కల్దుర్కి, మినార్‌పల్లి గ్రామాల్లో సొసైటీ చైర్మన్లు శరత్, రవీంద్ర బాబు ఆధ్వర్యంలో సేవలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులకు సొసైటీల్లో అందించే సేవలు, రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ డీజీఎం లింబాద్రి, సీఈవోలు, బ్యాంక్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

19న వీహెచ్‌పీఎస్ సమావేశం

బోధన్: వీహెచ్‌పీఎస్ రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈ నెల 19న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు బోధన్‌కు చెందిన ఆ సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా ఫించన్‌దారులకు ఇచ్చిన హామీల అమలు, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై సమావేశంలో చర్చ ఉంటుందని అన్నారు. సభ్యులు తప్పకుండా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై శిక్షణ



బోధన్‌రూరల్: బోధన్‌లో గురువారం టెక్నికల్ డీఈ అల్జాపూర్ శ్రీనివాస్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. బోధన్ డీఈ ఎండీ ముక్తార్, ఏడీఈ నగేశ్ కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.